# కోరికలే గుర్రాలైతే—

"మంజుశ్రీ"

స్కెచ్

కార్తీకమాసం. సాయంకాలం. గాలి చల్లగా వస్తున్నది. ఏదో కప్పుకోనకపోతే చలి వణికిస్తుంది బయట వసారాలో మంచంమీద దుప్పటి కప్పుకు కూచున్నాను. జ్వరపడి లేచాను. ఏ పని చేయాలన్నా విసుగ్గావుంటుంది. పదడుగులుకూడా కదల్లేని పరిస్థితి యేర్పడింది. ఏదో నిస్పృహ నన్నావరించింది. పాడుపరీక్షలు, ఇప్పుడే తెలిసినయ్. ఏదో నిర్లిప్తతతో వసారాలో కూచున్నాను.

దూరంగా మశీదులోని పున్నాగచెట్టునిండా ఆకులు కనబడకుండా పూలు పూచినయ్. చెట్టు మొత్తం తెల్లగా పూలతో నిండివుంది. ఆకతాయి పిల్లలు గోలగోలగా అరుస్తూ చెట్టుచుట్టూ తిరుగుతూ పూలేరుకుంటున్నారు. సాయంకాలంపూట చిన్నపిల్లలకు ఎంతో హుషారు. గూళ్ళు చేరుకునే పక్షులెలా కలకలారావాలు చేస్తూ వస్తుంటాయో అలా గోల గోలగా అరుస్తూ పిల్లలు ఇళ్ళు చేరుకుంటారు. నమాజుచేసే టైమైంది కాబోలు ముల్లా వాళ్ళందరినీ అరచి వెళ్ళగొట్టాడు. పూలు దారంట జారవిడుస్తూ పిల్లలు పరిగెత్తారు. గంభీరంగా నమాజు చేశాడు ముల్లా. భాగ్యాలూ, సుందరరాముడూ, వొడినిండా పూలేరుకొచ్చుకున్నారు కాబోలు, వసారాలో బండలమీదపోసి, మాల తయారు చేయటంలో నిమగ్నులైనారు. తమ్ముడు వొక్కొక్కపువ్వు తీసి అందిస్తుంటే, చెల్లి సావధానంగా అల్లి పెద్దమాల తయారుచేస్తున్నది. పున్నాగ పూలదొక వింతపరువం. వాటివైపు ఉత్సాహంగా చూస్తూ కూచున్నాను. చిన్నతనం గుర్తొచ్చింది. పువ్వెప్పుడు రాలుతుందా అని ఆశగా చెట్టుకిందే తారట్లాడేవాణ్ణి. రెండు జేబులూ నిండాలి. రెండు చేతులూ నిండాలి. అప్పుడింటికొచ్చేవాణ్ణి. ఆలోచనలిలా ముసురుకుంటున్నాయి. ఆకాశం ఎర్రబడిపోతున్నది. మగతగా కళ్ళు మూశాను...

కాలేజీ విడిచిపెట్టారు. కాంటిన్‌లో కాఫీ తాగి సిగరెట్ ముట్టించి రోడ్డు కార్నర్‌లో నిలబడ్డాను. అది దినచర్యే. అందులో కొత్తదనం లవలేశమూ లేదు. అది నాకొక అలవాటు. రాజ్యలక్ష్మి నా ముందునుంచి నడిచిపోయిందాకా నేనలానే నిలుచుంటాను. తరవాత వెనక నేనూ బయలుదేరుతాను. ఒక ఫర్లాంగు భాగ్యం. వెనక్కు తిరిగన్నా చూడదు. మహారాజ్ఞిలా నడిచి వెళ్ళిపోయేది. రోజూ మనస్సు చివుక్కుమనేది. కనీసం వోసారి వెనక్కు తిరిగి చూస్తే కొంపలంటుకపోతాయా? అలా ఫర్లాంగుదూరం నడిచి మర్రిచెట్టుదగ్గర మలుపు తిరిగి వెళ్ళిపోతుంది రాజ్యలక్ష్మి. ఆ తరవాత రెండు ఫర్లాంగులు నడిచి కొంపకి చేరుకునేవాణ్ణి నేను.

రాజ్యలక్ష్మి అంటే నా కభిమానం. ఆమెకు ప్రబంధ నాయిక కుండవలసినలక్షణాలన్నీ సంపూర్ణంగా వున్నాయి. చంద్రబింబం లాంటి వదనమూ, దొండపండులాంటి అధరమూ, కలువపూవు రేకుల్లాంటి కండ్లూ, తుమ్మెద రెక్కలనుహసించే ముంగురులూ, కారు మొగిలును ధిక్కరించే కేశపాశం, మొదలైనవీ, వాటితో కలసి విలసిల్లుతున్న సర్వలక్షణ సంశోభిత ఆమె.

అంతా బాగానేవుంది. కాని నా కొక్కదానికి మటుకు యేడుపు. రాజ్యలక్ష్మి నాకేసి కన్నెత్తైనా చూడదు. ఏడ్చినన్నాళ్ళు యేడ్చి, పోనీలే యెవరివైపూ చూడదు, వొక్క నావైపే గాదు, అని సరిపెట్టుకుంటుండేవాణ్ణి. నిజంగా కూడా అంతే. చూడగాచూడగా చాల ఆభిజాత్యంగల అమ్మాయిలాగా పొడకట్టింది. అయినా చూడటం మానుకోలేదు. మాటాడకపోతే మాటాడకపోయె. చూసినా సంతోషించవచ్చు. చూపులతో సౌందర్యాన్ని త్రాగవచ్చు, అది ఎవరో పెద్దలు వ్రాసింది ఎక్కడో చదివినట్లు జ్ఞాపకం. అందుకని మానుకోలేకపోయాను. అసలు విషయం మాకేసి

అడ్డదారిపట్టాను. అవాళ నా కళ్ళకు రాజ్యలక్ష్మి మరీ అందంగా కన్పించింది.

వెనకనే నడుస్తున్నాను. ఎలాగైనా వొక్క సారి మాటాడితే బాగుండును. ధన్యుణ్ణయిపోదును. మఱ్ఱిచెట్టు మలుపు తిరుగుతుందనగా, యెవరో యువకుడు సైకిలు ఆపి "రాజా సినిమా కెళ్దాం, రెడీగా వుండు. త్వరగా ఇప్పుడే వస్తాను" అని చెప్పి హుషారుగా సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి పోయాడు.

ఏ సినిమాకని అడగలేదు రాజ్యలక్ష్మి. అందు కని నాకు చాలా కోపమొచ్చింది. రాజ్యలక్ష్మి అడిగితే, అతను చెప్పివుంటే వాడు. నేనూ తయా రయి వుండేవాడిని. అయినా నాకిదేమిటి పిచ్చి? రాజ్యలక్ష్మి వివాహిత అయివుండవచ్చు ఇతడామె భర్త అయివుండవచ్చు. లేకపోతే కాబోయే భర్త అయివుండవచ్చు.

ఇవాళ వీళ్ళు ఏ సినిమా కెళతారో? అను కున్నాను మళ్ళీ. నన్ను నేను మళ్ళీ తిట్టుకున్నాను. మనసేం బాగులేదు. కొత్తగా హిందీ పిక్చర్ రిలీజైన హాలుదగ్గరకి చేరుకున్నాను. అదృష్టం. రాజ్యలక్ష్మి ఆమెపక్క ఇందాకటి యువకుడూ నిలబడి వున్నారు

అదృష్టంపైన మరో అదృష్టం. ఆ హాలు ఎవ రిదో, ఏమిటో నాకిదివరకసలు తెలీదు. కాని వొక్కసారిగా మా చలం కనపడ్డాడు. వీడు నాకు బాల్యమిత్రుడు. "ఏమిటిలా విశేషం" అన్నాను. "ఏమిరోయ్ భలే, భలే మారిపోయావు. ఏముంది. ఇది మా మేనమామ, కాబోయే అసలు మామ హాలు. శ్రీవారికి తోచనప్పుడల్లా, ఇల్లావస్తుంటారు" అన్నాడు. (కలలు ఇలానేవుంటాయి. ముఖ్యంగా పగటికలలు.)

రాజ్యలక్ష్మి వేపు దర్పంగా చూశాను. మా మాటలు బహుశా ఆమె వినివుండొచ్చు. అందుకే మనకింత గర్వం (ఎందుకో?) రాజ్యలక్ష్మి నా వైపు చూసి నవ్వుతూ, "నమస్తే (కల!) మీరూ సిని మాకొచ్చినట్లున్నారు. వీరు మా అన్నయ్య. లా చదువుతున్నాడు" అంది. నేను నన్ను పూర్తిగా మరిచిపోయ్యాను. వొళ్ళు తూలిపోయింది. మనసు తేలిపోయింది. "అహాహావచ్చానండీ, మీరూ అందుకే వచ్చినట్లున్నారు. కదూ! పెద్దగొడవ. టిక్కెట్లు దొరకటమే కష్టం" అన్నాను నేను వర్ధమాన మహావీరుడిలా, గొప్ప పోజుతో. రాజ్య లక్ష్మి నా వేపు జాలిగా చూసింది.

"వెధవాయీ నీకు టిక్కెట్టెందుకురా" అన్నాడు చలం. నేను పొంగిపోయాను. ఇలాంటి సమయంలో వాడు నన్ను కుంకా అని సంబోధిం చినా, యీషణ్మాత్రం కూడా నొచ్చుకొనను "పోనీ మాకు రెండు టిక్కెట్లు తెచ్చిపెట్టండి" అన్నాడు లా చదువుతున్న రాజ్యలక్ష్మి అన్నయ్య. నేను మావాడివైపు చూశాను. "ఛాఛా, నువ్వు నా స్నేహితుడివి. వాళ్ళు నీకు స్నేహితులు. అందరం కలసి వెళదాం పదండి" అన్నాడు. అప్ప ట్టున చలాన్ని కౌగలించుకుందామన్నంతా సరదా వేసింది. వెంటనే చిన్నయసూరి జ్ఞాపకమొచ్చాడు. "లోకమునందు మాతా పితలు మిత్రుడు అను ముగ్వురే హితులు." ఇందుకు మాచలం వో ఎగ్జాంపిల్. రాజ్యలక్ష్మి మొదట సంకోచించినా తరవాత వచ్చింది. ఇంటర్వెల్ లో నా వేపు చూసి నవ్వుతూ "రేపు సాయంత్రం నా వెనుక అలానే వచ్చివచ్చి మా ఇంటికి వస్తారుకదూ" అన్నది. నేను ముగు ణ్ణయిపోయాను ఆ మాటల తీరుచూసి. నవ్వుతూ తలవూపాను. మర్రోజు సాయంత్రం టీకి వెళ్లాను. కప్పులో పోసి ముందుకు నెట్టుతూ "నిన్న సాయంత్రం మీరు చాలా సహాయం చేశారు" అంది రాజ్యలక్ష్మి. "కాదు రాజ్యలక్ష్మీ.." నేనేదో చెప్పబోతున్నాను.

"ఎవరా రాజ్యలక్ష్మి! చల్లగాలిలో కూచున్నా వెందుకురా?" అమ్మ తట్టిలేపింది. కళ్ళు తెరచి చూశాను. కాస్త సిగ్గుపడ్డాను. కల కరగి పోయింది. ఆకాశం రంగులు మార్చుకుంటున్నది. తెలీకుం డానే నిట్టూర్పు విడిచాను. ముసురుకుంటున్న సంజనీడల్లో మసక మసకగా కనపడ్డది మళ్లీదు లోని పున్నాగచెట్టు.